క్లుప్తంగా

మువ్వాను కలిసిన మున్సిపల్ చైర్మన్..

వైరా: తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన మువ్వా విజయ్‌బాబును వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నాగి, రామకృష్ణ తదితరులున్నారు.

ఏపీ సీఎంను కలిసిన టీడీపీ మండలాధ్యక్షుడు

కొణిజర్ల: టీడీపీ కొణిజర్ల మండలాధ్యక్షుడు తాతా సుధాకర్‌రావు ఆదివారం ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ బల బలాలను గురించి వివరించినట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయానికి బీరువా బహూకరణ



బీరువా తాళాలను అందిస్తున్న వెంకటేశ్వర్ల దంపతులు

కారేపల్లి: కారేపల్లిలోని సాయిబాబా ఆలయానికి ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు మొరిశెట్టి వెంకటేశ్వర్లు–శ్రీదేవి దంపతులు బీరువాను బహూకరించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయిబాబా ఆలయ కమిటీకి రూ.9 వేలు విలువైన బీరువాను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నాగసాయిశర్మ, కమిటీ సభ్యులు బుచ్చిబాబు, ఇందుర్తి సురేందర్‌రెడ్డి, యర్రా చక్రపాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు వితరణ

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలోని జి.యస్.యస్. డేకేర్ సెంటర్‌లోని సుమారు 80 మంది నిరుపేద విద్యార్థులకు ఆదివారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా నోట్ పుస్తకాలు, బ్యాగులు, గిఫ్ట్ ప్యాకెట్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో డేకేర్ సెంటర్ ఇన్‌చార్జ్ మోదుగు వినోద్‌కుమార్, సంస్థ ప్రతినిధి జాన్, ఉపాధ్యాయులు నవీన్, మహబూబీ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి నిత్యావసరాలు పంపిణీ..

ముదిగొండ: ముదిగొండకు చెందిన షేక్ బాషా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సినీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉపేందర్ బాషా ఇంటికి వెళ్లి సుమారు రూ.10వేలు విలువైన నిత్యావసర వస్తువులను అందించారు. సరుకులతో పాటు వైద్యం నిమిత్తం మందులు ఇప్పించాడు.

నిరుపేదలకు..

ఏన్కూరు: వారాహి బాల భగవద్గీత సేవా వాహిని ఆధ్వర్యంలో మండల పరిధిలోని నాచారం, ఏన్కూరు గ్రామాల్లో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు ఆదివారం పంపిణీ చేశారు. గత మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కూలీ పనులకు వెళ్లని నిరుపేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందించారు. కార్యక్రమంలో వారాహి బాల భగవద్గీత సేవా వాహిని సభ్యులు శివ, నర్సింహారావు, చైతన్య పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థికి అస్వస్థత

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి ఎస్సీ బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న బొడ్డు గౌతమ్ అనే విద్యార్థికి జ్వరం వచ్చి ఆదివారం ఫిట్స్ రావటంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో విద్యార్థిని సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కేసు నమోదు

లైంగిక వేధింపులపై..

వేంసూరు: మండల పరిధిలోని చౌడవరం గ్రామానికి వివాహితపై అదే గ్రామానికి చెందిన గట్ల శివ లైంగికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరప్రసాద్ కేసు నమోదు చేశారు.

సరిహద్దు వివాదంపై..

వేంసూరు: వేంసూరులో సరిహద్దు వివాదంలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వేంసూరు రెవెన్యూలో జియావుద్దీన్‌కు చెందిన తోటకు.. పక్కన ఉన్న తోటలో సాదు వెంకటేష్, సాదు గాంధీలు దుక్కి చేసే క్రమంలో.. జియావుద్దీన్‌కు చెందిన టేకు మొక్కలు, గెట్టు రాళ్లు ధ్వంసం అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ జయబాబు కేసు నమోదు చేశారు.

రిటైర్డ్ ఏఎస్సైకి నివాళులు

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్ ఖాన్‌పేటకు చెందిన రిటైర్డ్ ఏఎస్సై భరోత్ పూసి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో.. ఆయన చిత్రపటం వద్ద ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బానోత్ బాలాజీ, కాళిదాసు, సానిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జరభద్రం

- పల్లెల్లో విజృంభిస్తున్న దోమలు
- ఇంటి పరిసరాలపై లోపించిన అవగాహన
- చైతన్య పర్చడంలో వైఫల్యం చెందుతున్న అధికారులు

వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. వాతావరణంలో మార్పులు స్తంభిస్తాయి. పాత, కొత్త నీరు కలయిక, దోమల వృద్ధి అధికమవ్వడం వంటివి అనివాయితీ. కలుషితమైన నీరు, అపరిశుభ్రమైన వాతావరణం కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు సోకే ప్రమాదం అధికంగా ఉంది. ప్రజలు వీటిపై నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తతే ఆయుధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వైరా పట్టణ కేంద్రంలో ఎంఈఓ కార్యాలయం ఎదుగ నిలిచిన మురుగు నీరు



గన్నవరం డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు

వైరారూరల్: పల్లెలతో పాటుగా పట్టణంలోనూ దోమల తీవ్రత క్రమేనా పెరుగుతుంది. దోమలతోనే డెంగీ, మలేరియా, విషజ్వరాల ప్రభావం అధికంగా ఉంటుంది. లార్వా దశలోనే దోమల ఉత్పత్తిని నియంత్రించాల్సిన అవసరం ఉంది. దోమల నివారణ సంబంధిత శాఖ అధికారులకు పెను సవాలే. వైరా మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా మరో మూడు శివారు గ్రామాలు ఉన్నాయి. ఆయా పంచాయతీలోని పలు కాలనీలు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఖాళీ స్థలాలు, డ్రెయిన్లు, రహదారుల వెంబడి మురుగు నీరు చేరి దోమలకు ప్రవాస కేంద్రాలుగా మారాయి.

కలుషిత నీటితో జాగ్రత్త..

వర్షకాలంలో కలుషిత నీరు తాగడం వలన అధికంగా రోగాలు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే అడపాదడపా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. వైరా రిజర్వాయర్‌లోకి క్రమేనా నీరు చేరుతుంది. ఈ రిజర్వాయర్ నుంచి ఒక వైరా మండలమే కాకుండా సుమారు 12 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయనున్నారు. రిజర్వాయర్‌లో కొత్తనీరు కలిస్తే ఆ నీటిని శుద్ధి చేయడం కొంత మేర అసాధ్యంగా మారనుంది. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటి నుంచే ఎప్పటికప్పుడు తాగునీటిని ఫిల్టర్ చేయడమే కాకుండా పైపులైన్ పగిలిన చోట తక్షణమే మరమ్మతులు చేయకపోతే పల్లె వాసులకు కలుషిత నీరు సరఫరా అయ్యి ప్రజలు రోగాల బారీన పడే ప్రమాదం ఉంది.

మలేరియా జ్వరం..

ఈ వ్యాధి ఎనాఫిలిస్ అనే దోమ కుట్టడం వలన వస్తుంది. మలేరియాలో రెండు రకాలు ఉన్నాయి. ప్లాస్మోడియం వైవాస్ (పీవీ), రెండోది ప్లాస్మోడియం ఫాల్సీఫారం(పీఎఫ్) మలేరియాలో మొదటిరకం. ఇది అంత ప్రమాదకరం కాదు. పీఎఫ్ మాత్రం ప్రమాదకరమైంది. దీంతో తీవ్రమైన చలిజ్వరం, తలనొప్పి, రోజు విడిచి రోజు జ్వరం రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.. కావున వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి.

డెంగీ జ్వరం..

ఈ వ్యాధి నీటిలో పెరిగే ఈడస్ ఎడిస్‌పై అనే దోమ వలన వస్తుంది. నల్లగా ఉండే దోమపై తెల్లమచ్చలుంటాయి. తన శరీరంలోకి డెంగ్యూ ప్రవేశించిన వారం రోజుల తర్వాత ఈ దోమ మనుషులను కుట్టినట్లయితే వ్యాధి వ్యాపిస్తుంది. పగటిపూట మాత్రమే ఈ దోమ సంచరిస్తుంది. సకాలంలో చికిత్స చేయించుకోకపోతే ప్లేట్‌లెట్స్ పడిపోయి మనిషి మరణించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

జ్వర లక్షణాలు..

కళ్లు కదలించలేని పరిస్థితి ఏర్పడుతుంది. శరీరంలోని ఎముకలు, కండరాలు నొప్పులు వస్తాయి. కొందరికి శరీరంపై పొక్కులు కూడా వస్తాయి. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధికారక వైరస్ రక్తంలో ఉత్పత్తి అవుతూ ప్లేట్‌లెట్స్‌ను తగ్గిస్తుంది.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి..



సీజనల్ వ్యాధుల కాలం కావడం వలన వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. జ్వర పీడితులను గుర్తించి తక్షణ వైద్యం అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలి. జ్వర బాధితులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి.

– బినాల రాజీవ్, కేజీ సిరిపురం

అవగాహన కల్పించాలి..



పల్లె ప్రజలు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల బారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలి. అంతేకాకుండా ఇంటి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించి పూల కుండీలు, నీటి తొట్టెలు, రిఫ్రిజిరేటర్లలో నీరు నిల్వ ఉంచకుండా తీసుకోవాలి.

– యమాల గోపాలరావు, సీపీఐ మండల కార్యదర్శి, వైరా

అప్రమత్తంగా ఉండాలి..



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వేడి చేసిన నీటిని తాగడంతో పాటు ఆహారం కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. జ్వరపీడితులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను ఆశ్రయించి మెరుగైన వైద్యం చేయించుకోవాలి.

– కె.మోహన్‌రావు, ప్రైవేట్ వైద్యుడు, వైరా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేంసూరు: నీటి ప్రవాహాలు, వాగులు వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రాజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఊటవాగు, కట్లేరు వాగులను పరిశీలించారు. అంతకు ముందు ఎర్రగుంటపాడు యానదుల కాలనీని పరిశీలించి.. సమస్యలను తెలుసుకొన్నారు. కాలనీ వాసులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీఓ రంజిత్ కుమార్, ఎస్‌ఐ వీరప్రసాద్ పాల్గొన్నారు.



అడసర్లపాడులో ఊటవాగును పరిశీలిస్తున్న ఆర్డీఓ

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



వేంసూరు: చౌడవరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వైరా: మండల కేంద్రంలో ఆదివారం బోడేపూడి కళానిలయం వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఖమ్మానికి చెందిన ప్రముఖ వైద్యుడు చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, నాయకులు నాగేశ్వరరావు, సమత, రజిత, రజని, రామారావు, ప్రసాద్, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని అష్ణగుర్తి గ్రామంలో సువిధ జాగృతి ఎస్ఆర్ఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మన్మధరావు, రవికుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు: మండలంలోని చౌడవరంలో సత్తుపల్లి విజేత హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్ పరీక్షలు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యుడు కంటే సాగర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొర్ల సత్యనారాయణరెడ్డి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

తల్లాడ: తల్లాడ సొసైటీలో రూపే కార్డులు దొంగలించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రూపే కార్డుల అవకవతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ.. ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మల్లవరం మాజీ ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. 700 మంది ఎకౌంట్ల నుంచి రూ.42 లక్షలు స్వాహా చేశారని, వారిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అన్నం ఫౌండేషన్‌కు తరలింపు

కొణిజర్ల: మతిస్థిమితం లేని ఓ గుర్తు తెలియని యువతి జోరు వానలో మండలంలోని తనికెళ్లలో తిరిగుతుండగా గుర్తించిన స్థానికులు ఆదివారం ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు యువతిని వాహనంలో కొణిజర్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. ఏఎస్సై బేగ్ సమక్షంలో పోలీస్ అధికారుల సూచనల మేరకు అన్నం ఫౌండేషన్‌కు తరలించారు.

‘రాయల’ సేవలు చిరస్మరణీయం

వైరారూరల్: మాస్‌లైన్ కేంద్ర నాయకుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సేవలు చిరస్మరణీయమని సీపీఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జున్‌రావు అన్నారు. మండలంలోని గొల్లపూడి గ్రామంలో రాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ 50 ఏళ్లుగా విప్లవోద్యమంలో ప్రజల కోసం ఎనలేని త్యాగాలు చేశారన్నారు. బంక యోహాన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇఫ్ట్ వైరా డివిజన్ అధ్యక్షుడు బండారు భద్రయ్య, నాయకులు బాబు, సాయమ్మ, రమణ, చంద్రకళ, పద్మ, మరియమ్మ, యశోధ, సువార్త తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెనూ పెంచాలి

కొణిజర్ల: ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థుల మెస్ ఛార్జీలు, మెనూ పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తనికెళ్లలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆ పార్టీ నాయకులు సందర్శించి మాట్లాడారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినా.. ప్రభుత్వం విద్యార్థుల మెనూ ఛార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కల్లూరు పెద్ద చెరువు చప్టాకు మరమ్మతులు

కల్లూరురూరల్: కురుస్తున్న వర్షాలకు కల్లూరు పెద్ద చెరువు నాలుగు రోజులుగా అలుగు పారుతుంది. కల్లూరు నుంచి లక్ష్మీపురం గ్రామం వెళ్లేందుకు ఈ అలుగు చప్టాపైనే రహదారి సౌకర్యం ఉంది. పెద్ద చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చప్టాలోని ఆరు తూరలు (సొరంగాలు) గుండా వాగులోకి నీరు వెళ్లాల్సిఉండగా చప్టాలోని నాలుగు తూరలు పూడుకుపోయాయి. దీంతో అలుగునీరు చప్టాపై నుంచి ప్రవహిస్తూ ఉండడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గమనించిన అధికారులు తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, జలవనరులశాఖ అధికారుల సూచన మేరకు పంచాయతీ సిబ్బంది ఆదివారం ప్రొక్‌లైన్ సహాయంతో పూడిక తొలగించారు. దీంతో చాప్టాపై నీరు తొలగిపోవడంతో రాకపోకలకు ఆటంకం తొలగిపోయింది.

అయ్యో రోడ్డు ఇలా వేస్తారా..

కల్లూరు: మండలంలోని చెన్నూరు, యర్రబోయినపల్లి గ్రామాల మధ్య నిర్మించిన తారు రోడ్డు కృంగిపోయింది. నిర్మించి సంవత్సరం కూడా కాకుండానే కృంగడంతో చూసినవారంతా అయ్యో రోడ్డు ఇలా వేసారేంటి అని గుసగుసలాడుకుంటున్నారు. నాసిరకపు నిర్మాణాల కారణంగానే ఇలా జరిగిందని.. అధికారులు స్పందించాలని కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, కేవీఆర్, పోట్రు సత్యం, రామకృష్ణ, భాగం ప్రభాకర్, మట్టా రామకృష్ణ, పెద్దబోయిన శ్రీను, తాళ్ళ వెంకటేశ్వర్లు, సాయి కోరుతున్నారు.

అమ్మవార్లకు ఆషాఢ బోనాలు

వైరాలో పోచమ్మకు..



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న యాదవులు

వైరా: వైరా మున్సిపాలిటీలో ఆషాఢమాసం సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ సాయి పోచమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా పట్టణంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ బోనాలు ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగారావు, వెంకటనర్సిరెడ్డి, రాజశేఖర్, సీతారాములు, హరినాద్, గంగారావు, సుమంత్, అశోక్, సంతోష్, కిరణ్, రామారావు, కిషోర్, శ్రీనివాసరావు, రాహుల్ పాల్గొన్నారు.

కొత్త కమలాపురంలో మారెమ్మతల్లికి..

కారేపల్లి: మండలంలోని కొత్త కమలాపురం గ్రామంలో ఎర్ర మారెమ్మతల్లికి గ్రామస్తులు బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు అచ్యుతానందశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అనంతరామయ్య, తాతా సతీష్, విశ్వేశ్వరరావు, నరసింహారావు, రంగారావు, నరసయ్య, రామకృష్ణ, రోశయ్య, శ్రీను పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ



రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ లత

మధిర: మధిర మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కోసం రెయిన్‌కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు వైవీ అప్పారావు, వెంకటేశ్వరరావు, మాధురి, మాధవి, హెల్త్ ఇన్ ఛార్జ్ రేవతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా అమ్మవారు



మధిరరూరల్: శాకంబరీదేవిగా లక్ష్మీ తిరుపతమ్మ తల్లి



తల్లాడ: నారాయణపురం ముత్యాలమ్మ దేవాలయంలో..

మధిరరూరల్: మండలంలోని నాగవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య సమేత స్వామి వారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా తిరుపతమ్మ తల్లిని ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మ దేవాలయంలో..

తల్లాడ: మండలంలోని నారాయణపురం ముత్యాలమ్మ దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కంచెల సతీషశర్మ ఆధ్వర్యంలో.. ఐదు క్వింటాళ్ల ఆకు కూరలు, కూరగాయలతో గ్రామస్తులు శాకంబరీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సరస్వతీ దంపతులు, కర్నాటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పలువురు దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరిగాయి.

పోస్టర్లు ఆవిష్కరణ

తల్లాడ: హైదరాబాద్ ఎల్బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. తల్లాడ ఫొటో గ్రాఫర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించి.. ఎస్సై మాట్లాడార ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ చెర్రీ, ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, నారాయణరావు, ఓంకార్, రామారావు, నరేష్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో తీరని నష్టం



సమస్యను వివరిస్తున్న సంఘ సభ్యులు

మధిరరూరల్: మధిర పెద్ద చెరువులో చేపలు పట్టుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో తమకు తీరని నష్టం వాటిల్లిందని మధిర మత్స్య సహకార సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆదివారం చెరువు వద్ద వారు తమ సమస్యలను విలేకరులకు వివరించారు. వందలాది కుటుంబాలు మధిర చెరువులో పెరిగే చేపలను సొసైటీ ఆధ్వర్యంలో విక్రయించుకుని జీవిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు పులిపాటి సుబ్బారావు, సంఘ సభ్యులు పాపట్ల రమేష్, గద్దల లాలయ్య తదితరులు తెలిపారు. గత మూడు నెలల క్రితం చేపలు పట్టుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేయగా.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి చేపలు బయటికి వెళ్తున్నాయని, ఎగువన పొలాల్లోకి చేరుతున్నాయని తెలిపారు. దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు అధికారులకు తమ సమస్యను చెప్పడం జరిగిందన్నారు. 2024–25కు సంబంధించి చెరువుకు లీజ్ డబ్బులు కూడా చెల్లించడం జరిగిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చేపలు పట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి మోయిజ్, చిలకా రాజేందర్, గద్దల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు బాబాకు విఘ్నేశ్వరపూజ, కాగడా హారతి, పంచామృతాభిషేకం, శ్రీసాయి చాలీసా, గోత్ర, సహస్రనామార్చలు నిర్వహించడంతో పాటు పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయి ఆలయాలు భక్తుల భజనలు, సాయి కీర్తనలతో మార్మోగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



ఎర్రుపాలెం: శ్రీసాయి ఆలయంలో..



చింతకాని: పందిళ్లపల్లి సాయిబాబా ఆలయంలో..



ఏన్కూరు: బాబా మందిరంలో పూజలు చేస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్



బోనకల్‌లో..



వేంసూరు: మర్లపాడు శ్రీషిర్డీ సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు




కొణిజర్ల: బాబా విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



వైరా గండగలపాడు సాయిబాబా దేవాలయంలో..



సత్తుపల్లిటౌన్: శ్రీషిర్డీ సాయి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కల్లూరులోని సాయి ధ్యాన మందిరంలో..



తల్లాడ: ముద్దునూరులో..



ముదిగొండ: మేడేపల్లిలో..